మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 267 | మంగళవారం | 14 - 04 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## దేవస్థానం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం



3లో..

## మిక్సర్‌ను ఢీకొన్న వ్యాన్.. 11 మంది మృతి



- థానే జిల్లాలో విషాద ఘటన
- కల్యాణ్‌ముర్బాద్ మార్గంలో ప్రమాదం
- గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమం

మహారాష్ట్ర, మన గళం : మహారాష్ట్ర రాష్ట్రంలోని థానే జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కల్యాణ్ నుంచి ముర్బాద్ వైపు ప్రయాణిస్తున్న ఈకో వ్యాన్ ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ వాహనాన్ని 2 లో..

## పరిశ్రమల విస్తరణకు దిశానిర్దేశం

- సీఎం చంద్రబాబుకేంద్ర బృందం కీలక చర్చలు
- పెట్టుబడులకు అనుకూల వాతావరణంపై సమగ్ర సమీక్ష
- పర్యావరణం, ప్రజల భద్రతపై రాజీ లేకుండా అభివృద్ధి
- డిజిటల్ గవర్నెన్స్‌తో వేగవంతమైన అనుమతులు







అమరావతి, మన గళం : రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఉక్కు గనుల శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగిస్తూ పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం సృష్టించే దిశగా కీలక నిర్ణయాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల మంజూరులో వేగం పెంచడం అత్యంత అవసరమని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న విధానాలను మరింత సరళీకరించి, పెట్టుబడిదారులు ఎదుర్కొనే సమస్యలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల 2 లో..

## అధికారులపై కారం చల్లిన వృద్ధురాలు

- ప్రజా పరిష్కార వేదికలో ఉద్రిక్త పరిస్థితి
- భూమి నష్టపరిహారం కోసం వృద్ధురాలి ఆవేదన
- అధికారుల తీరుపై నిరసనగా చర్య





విజయవాడ, మన గళం : ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. అధికారులపై ఓ వృద్ధురాలు కారం చల్లి నిరసన వ్యక్తం 2 లో..

## ఢిల్లీ లిక్కర్ కేసు... హైకోర్టులో కేజ్రీవాల్ వాదనలు

- స్వయంగా కోర్టులో వాదనలు వినిపించిన మాజీ ముఖ్యమంత్రి
- విచారణలో పక్షపాతం ఉందని ఆరోపణలు
- దర్యాప్తు సంస్థలపై తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ, మన గళం : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో విచారణ కొనసాగిస్తున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిగిన సందర్భంగా కేజ్రీవాల్ స్వయంగా కోర్టులో హాజరై తన వాదనలు వినిపించడం విశేషంగా మారింది. విచారణ సమయంలో తనపై 2 లో..

## ఓటర్ల తొలగింపులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఎన్నికల రద్దుకు స్పష్టమైన ప్రమాణం
- ఎన్నికలపై ప్రభావం ఉంటేనే రద్దు సాధ్యం
- ఓటు హక్కు రాజ్యాంగపరమైనదే కాక భావోద్వేగ అంశం కూడా
- ‘సర్’ ప్రక్రియపై పిటిషన్ల విచారణకు నిరాకరణ



న్యూఢిల్లీ, మన గళం : ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల పేర్లు భారీగా తొలగించినా, ఆ తొలగింపులు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు నిరూపితమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థను ప్రోత్సహించేలా న్యాయపరమైన జోక్యం ఉండాలని కూడా పేర్కొంది.

పశ్చిమ బెంగాల్‌లో అమలు చేసిన “సర్” ప్రక్రియపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో కొనసాగడం ప్రతి ఓటరికి హక్కు అని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని స్పష్టం చేసింది. అయితే ఓటర్ల పేర్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను నేరుగా 2 లో..

## లక్నోలో తయారైన బ్రహ్మోస్ క్షిపణుల తొలి విడత సరఫరా




- ఆత్మనిర్భర్ భారత్‌కు బలం
- యూపీ డిఫెన్స్ కారిడార్‌లో ఉత్పత్తి ప్రారంభం
- దేశీయ రక్షణ తయారీలో కీలక మైలురాయి
- రికార్డు స్థాయిలో రక్షణ ఉత్పత్తి, ఎగుమతులు

లక్నో, మన గళం : దేశీయ రక్షణ తయారీలో కీలక అడుగుగా లక్నోలో తయారైన బ్రహ్మోస్ క్షిపణిల తొలి విడతను భారత సైన్యానికి అందజేశారు. ఈ ఘట్టం దేశం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి 2 లో..

## రాష్ట్రపతికి నారా లోకేష్ కృతజ్ఞతలు





- రాష్ట్రపతి భవన్‌లో లోకేష్ భేటీ
- రైతుల త్యాగాలను గుర్తు చేసిన మంత్రి
- ముఖ్యమంత్రి నాయకత్వాన్ని కొనియాడిన లోకేష్

2 లో..

# అధికారులపై కారం చల్లిన వృద్ధురాలు

చేయడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేషనల్ హైవే నిర్మాణం కోసం తన భూమిని తీసుకున్నప్పటికీ తగిన నష్టపరిహారం అందలేదని వృద్ధురాలు ఆరోపించింది. తనకు రూ.24 లక్షలు రావాల్సి ఉందని, పలుమార్లు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేసింది.తన భూమి తీసుకుని వేరే వారికి డబ్బులు చెల్లించారని వృద్ధురాలు ఆరోపించింది. ఈ విషయంలో న్యాయం చేయాలని పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురైనట్లు తెలిపింది.అధికారుల నిర్లక్ష్య వైఖరితో విసుగుచెంది కారం చల్లినట్లు వృద్ధురాలు వెల్లడించింది. తనకు న్యాయం చేయకపోతే ఇలాంటి చర్యలు తప్పవని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనతో కలెక్టరేట్‌లో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడి సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి వృద్ధురాలిని ప్రశాంతంగా మాట్లాడించారు. అధికారుల భద్రత కోసం అదనపు జాగ్రత్తలు తీసుకున్నారు.వృద్ధురాలి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రాష్ట్రపతికి నారా లోకేష్ కృతజ్ఞతలు

ఢిల్లీ, మన గళం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి బిల్లును ఆమోదించినందుకు రాష్ట్ర మంత్రి, యువ నాయకుడు నారా లోకేష్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో రాష్ట్రపతిని కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ భేటీలో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటు ఇతర ఎంపీలు కూడా పాల్గొన్నారు. అమరావతి రాజధాని అంశంపై తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రపతితో జరిగిన సమావేశంలో ఈ విషయాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ కోట్లాది ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం తమకు దక్కిన గొప్ప అవకాశంగా నారా లోకేష్ అభివర్ణించారు. రాజధాని అంశంపై ఎంతోకాలంగా ఉన్న అనిశ్చితికి ఈ నిర్ణయం ముగింపు పలికిందని ఆయన అన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించే దిశగా ఇది ముందడుగు అని తెలిపారు.ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం కోసం తమ భూములను ఇచ్చిన రైతుల అసాధారణ పట్టుదల, త్యాగాలను లోకేష్ గుర్తు చేసుకున్నారు. రైతుల సహకారం లేకుండా ఈ స్థాయిలో ప్రాజెక్టు సాధ్యపడేది కాదని ఆయన అన్నారు. వారి ఆశయాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ఈ సందర్భంగా లోకేష్ కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన దిశను చూపిస్తూ, రాజధాని అంశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు మేలు చేసేలా ఉంటాయని తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం ద్వారా రాష్ట్రానికి కొత్త గుర్తింపు వస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో అమరావతి కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మిక్సర్‌ను ఢీకొన్న వ్యాన్.. 11 మంది మృతి



ఢీకొనడంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. నేషనల్ హైవే 61పై గోవిలి గ్రామ సమీపంలోని రైతా వంతెన వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.ప్రాథమిక సమాచారం ప్రకారం, ఉదయం సుమారు 10.45 గంటల సమయంలో ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్ అధిక వేగంతో ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న మిక్సర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కళాశాల విద్యార్థులు కూడా ఉండటం ఈ ఘటనను మరింత కలచివేసింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో వాహనాలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపోయిన దృశ్యాలు భయానకంగా మారాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లక్నోలో తయారైన బ్రహ్మోస్ క్షిపణుల తొలి విడత సరఫరా

మరింత బలాన్ని చేకూర్చినట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. యూపీ డిఫెన్స్ కారిడార్‌లో భాగమైన లక్నో కేంద్రంలో బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తి ప్రారంభమవడం ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక క్షిపణి వ్యవస్థను స్థానికంగా తయారు చేయడం ద్వారా రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో కీలక పురోగతి సాధించారు.

బ్రహ్మోస్ క్షిపణి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఈ క్షిపణిని పూర్తిగా దేశీయంగా తయారు చేసి సైన్యానికి అందించడం ద్వారా భారత రక్షణ సామర్థ్యం మరింత బలపడింది. దేశ రక్షణ ఉత్పత్తి రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతూ 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును చేరింది. ఇది దేశీయ తయారీ సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. స్వదేశీ పరిశ్రమలకు ఇది పెద్ద ఊతమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే 202526లో రక్షణ ఎగుమతులు రూ.38,424 కోట్లకు చేరుకోవడం మరో విశేషం. భారత తయారీ రక్షణ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లో కూడా ప్రాధాన్యం సంపాదిస్తున్నాయి. ఇది దేశానికి ఆర్థికంగా కూడా లాభదాయకమని భావిస్తున్నారు. బ్రహ్మోస్ క్షిపణుల దేశీయ ఉత్పత్తి, సరఫరాతో భారత్ మరింత శక్తివంతమైన రక్షణ వ్యవస్థగా ఎదుగుతున్నదని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక ఆయుధాలను స్వదేశంలోనే తయారు చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఢిల్లీ లిక్కర్ కేసు... హైకోర్టులో కేజ్రీవాల్ వాదనలు

పక్షపాతం చూపుతున్నారనే అనుమానం వ్యక్తం చేసిన కేజ్రీవాల్, సాక్షుల వాంగ్మూలాలపై కోర్టు చేసిన వ్యాఖ్యలు తనను ముందుగానే దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో న్యాయసమ్మతమైన విచారణ కోసం జడ్జిని మార్చాలని కోర్టును కోరారు. ఈ అంశం దేశవ్యాప్తంగా రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారుతోంది.ఇక దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి సంస్థలు సాక్షులను ముందుగా అరెస్టు చేసి, తరువాత ఇతరులను ఇరికించేలా ఒత్తిడి తెచ్చి వాంగ్మూలాలు తీసుకుంటున్నాయని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ వ్యాఖ్యలు విచారణలో కొత్త వివాదాలకు దారి తీసే అవకాశముంది. ఇదిలా ఉండగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును సవాలు చేస్తూ ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం, సీబీఐకి నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను ఏప్రిల్ 13కి వాయిదా వేసింది. ప్రస్తుతం ఈ కేసు పరిణామాలు దేశ రాజకీయాల్లో కీలక చర్చగా మారుతున్నాయి.ఖ

# ఓటర్ల తొలగింపులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసులు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణలో ఉన్నాయని గుర్తు చేసింది. అందువల్ల ఈ దశలో జోక్యం అవసరం లేదని తెలిపింది. పిటిషనర్లు ఎన్నికల సంఘం సరైన ప్రక్రియ లేకుండా ఓటర్ల పేర్లు తొలగిస్తోందని ఆరోపించారు. అలాగే ఈ అంశంపై దాఖలైన అప్పీల్స్‌ను సకాలంలో విచారించడం లేదని పేర్కొన్నారు. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు వివరాలు అందిస్తూ, కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 30 నుంచి 34 లక్షల వరకు అప్పీల్స్ విచారణకు ఉన్నాయని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఓటు హక్కు రాజ్యాంగపరమైనదే కాకుండా భావోద్వేగ అంశమని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రక్రియలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపింది. ట్రైబ్యునళ్లపై కాలపరిమితి విధించడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ, ఎన్నికల రద్దుకు కఠిన ప్రమాణాలను మరోసారి స్పష్టం చేసింది.

# పరిశ్రమల విస్తరణకు దిశానిర్దేశం

స్థాపనలో సమయపాలన కీలకమని పేర్కొంటూ, అనుమతుల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అయితే అభివృద్ధి పేరుతో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలను విస్మరించరాదని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కాలుష్య నియంత్రణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అభివృద్ధిపర్యావరణం మధ్య సమతుల్యత ఉండాలనే అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అధికారుల వేధింపులు లేకుండా పారదర్శక వ్యవస్థను నెలకొల్పేందుకు థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. పరిశ్రమల అనుమతుల్లో అవినీతి, ఆలస్యం వంటి సమస్యలను నివారించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని తెలిపారు. అటవీ చట్టాలను సాధ్యమైనంత వరకు సరళీకరించి, పెట్టుబడిదారులకు అనుకూల పరిస్థితులు కల్పించాలని కేంద్ర బృందానికి సూచించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థలను కూడా సీఎం వివరిస్తూ, డేటా లేక్, రియల్ టైమ్ డేటా మానిటరింగ్, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి సాంకేతిక పద్ధతులు పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థల ద్వారా అనుమతులు వేగంగా మంజూరు చేయడంతో పాటు, పారదర్శకత పెరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రతినిధి బృందం రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలను ప్రశంసించింది. అనుమతుల మంజూరులో వేగం, నిబంధనల సడలింపులో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని అభిప్రాయపడింది. పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టించడంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి ఆకర్షితమవుతాయని, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేసింది.

# శ్రీకాకుళంతిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

శ్రీకాకుళం, మన గళం: ఉత్తరాంధ్ర ప్రాంత చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచే విధంగా శ్రీకాకుళం రోడ్‌తిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ 17439/40ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా ప్రారంభించారు. 75 సంవత్సరాల జిల్లా చరిత్రలో తొలిసారిగా తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సేవ ప్రారంభం కావడం ద్వారా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరింది. ఈ ఘట్టం శ్రీకాకుళం జిల్లాకు మాత్రమే కాకుండా మొత్తం ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక పెద్ద పురోగమనంగా నిలిచింది.

ఈ రైలు సేవ ద్వారా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం మరియు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మధ్య ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడింది. దీని ద్వారా భక్తులకు యాత్ర మరింత సులభతరం, వేగవంతం, సౌకర్యవంతంగా మారింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు తిరుపతికి వెళ్లేందుకు ఎదుర్కొనే ప్రయాణ ఇబ్బందులు ఇక గణనీయంగా తగ్గనున్నాయి. రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఈ సేవపై ప్రజల్లో కనిపిస్తున్న ఆనందాన్ని పంచుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డిమాండ్ నెరవేరడం పట్ల ప్రజలు వ్యక్తం చేస్తున్న సానుకూల స్పందన తనకు సంతృప్తిని కలిగించిందని తెలిపారు. భక్తుల ప్రయాణం సౌకర్యవంతంగా మారడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకం కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ కేవలం ఒక రైలు సేవ మాత్రమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి ఒక కొత్త ద్వారం తెరిచినట్లుగా భావిస్తున్నారు. వ్యాపార, పర్యాటక రంగాల విస్తరణకు ఇది దోహదపడటంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



రవాణా సౌకర్యాలు మెరుగుపడటం ద్వారా జిల్లాలో పెట్టుబడులు ఆకర్షితమవుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.

ఈ సేవ ప్రారంభానికి సహకరించిన నరేంద్ర మోదీ, అశ్విని వైష్ణవ్లకు కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి మరిన్ని మౌలిక వసతులు, అభివృద్ధి ప్రాజెక్టులు రాబోతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ రైలు సేవ ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను, అభివృద్ధి ఆకాంక్షలను నెరవేర్చే కీలక అడుగుగా నిలుస్తుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



# వివాహ మహోత్సవంలో గుమ్మనూరు నారాయణ కమలమ్మ దంపతులు





(ఆలూరు మనగళం): గుంతకల్లు పట్టణం మార్కండేయ స్వామి ఆలయం నందు గుంతకల్లు పట్టణానికి చెందిన ప్రదీప్ ప్రత్యేక ఆహ్వానం మేరకు వారి సోదరి వివాహ మహోత్సవ రిసెప్షన్ కు ముఖ్య అతిథులుగా ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ కమలమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గుమ్మనూరు నారాయణ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడా" కార్యక్రమంతో మహిళకు మరింత ఆరోగ్యం.

**– ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి.**






(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో ( ఐసిడిఎస్ ) సమగ్ర మహిళ మరియు శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ పోషణ పక్వాడా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆలూరు టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం పౌష్టికాహారం ప్రాముఖ్యతను మహిళలకు వివరించారు. స్థానిక మహిళలు మరియు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం... పోషకాహారమే దానికి మార్గం" అంటూ హితబు పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతవాణి, సి.ఎస్.డి.టి దీపా, సిడిపిఒ నరసమ్మ, సూపర్వైజర్ పద్మావతి, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అంగన్వాడి కార్యకర్తలు మరియు సహాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జీతాల పెంపుపై జేసీఎం భేటీ.. ఉద్యోగుల్లో ఉత్కంఠ




న్యూఢిల్లీ, మనగళం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల పెంపుపై కీలకమైన పరిణామం చోటుచేసుకోనుంది. నేడు జాయింట్ కన్సల్టేటివ్ మెకానిజం డ్రాఫ్టింగ్ కమిటీ సమావేశం జరుగుతుండగా, ఇందులో జీతాలు, పెన్షన్లు, అలవెన్సుల పెంపుకు సంబంధించిన తుది మెమోరాండం సిద్ధం చేయనున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కరువు భత్యాన్ని ప్రాథమిక వేతనంలో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు బలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిర్ణయం అమలైతే బేసిక్ వేతనంతో పాటు ఇతర భత్యాలు కూడా పెరిగి, ఉద్యోగుల చేతికి వచ్చే మొత్తం ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం కేంద్ర ఉద్యోగులు సుమారు 58 శాతం కరువు భత్యం పొందుతున్న నేపథ్యంలో, ఇది మరో 2 శాతం పెరిగి 60 శాతానికి చేరే అవకాశముందని సమాచారం. ఈ పెంపు అమలైతే జనవరి 1, 2026 నుంచి బకాయిలు కూడా చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కొత్త వేతన సంఘంలో జీతాల పెంపును నిర్ణయించే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కనీసం 3.25గా ఉండాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. దీనిపై ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తే లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు పెద్ద ఎత్తున ఆర్థిక లాభం చేకూరనుంది.

ఈరోజు జరిగే సమావేశంలో ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు, కొత్త వేతన స్కేలు, అలాగే గతంలో వేతన సంఘం అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలపై కూడా చర్చించనున్నారు. ఈ సమావేశం అనంతరం సిద్ధమయ్యే నివేదిక ఆధారంగా ఎనిమిదవ వేతన సంఘం తుది సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది. దీంతో కోట్లాది మంది ఉద్యోగుల కుటుంబాల్లో ఆశలు పెరుగుతున్నాయి.

# దేవస్థానం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం








మనగళం శ్రీశైలం : ఈరోజు (12.04.2026) పరిపాలన అంశాలపై దేవస్థానం ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ విశ్రాంత ఫ్యాకల్టీమెంబర్ శ్రీ డి.శివ ప్రసాద్ , ఆయా అంశాల గురించి దేవస్థానం ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణా యొక్క ఆవశ్యకతను,లక్ష్యాలను వివరించారు , ఉద్యోగులు శిక్షణా పొందడం వల్లన ఎప్పటికప్పుడు మరింత సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందన్నారు. శిక్షణా లో ఆయా అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసునే అవకాశం ఉందన్నారు, రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను ఉద్యోగులు అందిపుచ్చుకోవాలన్నారు. తర్వాత శిక్షకులు శ్రీ డి.శివ ప్రసాద్ రోజువారీ పరిపాలన అంశాలను వివరించారు, ముఖ్యంగా వారు ఉద్యోగుల ప్రవర్తన నియమావళి , క్రమశిక్షణ చర్యలు, ఫండమెంటల్ రూల్స్ , వేతనాల బిల్లు రూపొందించే విధానం, డిస్ట్రిక్ట్ ఆఫీస్ మ్యాన్యువల్ (ఐ.వా.వీ)గ్రా.= నిర్వహణ, మూవ్మెంట్ రిజిస్టర్ నిర్వహణ , మొదలగు అంశాల గురించి వివరించారు అదేవిధంగా జ.జ.ూా రూల్స్ , ఆఫీస్ నోటింగ్, ఆఫీస్ డ్రాఫ్టింగ్ , మొదలగు అంశాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధిపతులు, విభాగాల పర్యవేక్షకులు , సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు , రికార్డు అసిస్టెంట్లు , తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ ఇ. శ్రీనివాసరావు, విశాఖపట్నం వారు ఈ రోజు (13.04.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,000/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

# ఎయిరిండియా ఉద్యోగులకు షేర్ల ప్రోత్సాహకం

న్యూఢిల్లీ, మనగళం : నష్టాల్లో ఉన్న విమానయాన సంస్థ ఎయిరిండియాను లాభాల దిశగా నడిపించేందుకు టాటా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములుగా మార్చే ఉద్దేశంతో పనితీరు ఆధారంగా షేర్లను అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ పథకానికి 'పీఎస్ఓపీ 2026' అని పేరు పెట్టగా, ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ పథకం కింద పైలట్లు, ఇంజనీర్లు, ఉన్నత స్థాయి నిర్వహణ సిబ్బంది సహా అర్హులైన ఉద్యోగులకు సంస్థ షేర్ ఆప్షన్లు కేటాయించనుంది. ఉద్యోగులు ఈ షేర్లను తక్కువ ముఖ విలువ నుంచి మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించడం, సంస్థ వృద్ధి మరియు లాభదాయకతను పెంచడమేనని టాటా గ్రూప్ తెలిపింది. ప్రతిభావంతులను ఆకర్షించడం, వారిని సంస్థలో కొనసాగించేలా చేయడం కూడా దీని లక్ష్యంగా ఉంది. ఈ పథకం కింద మొత్తం షేర్ మూలధనంలో స్వల్ప శాతానికి సమానమైన కోట్ల సంఖ్యలో షేర్ ఆప్షన్లు జారీ చేయనున్నారు. షేర్ల కేటాయింపుకు ఒకటి నుంచి ఐదు సంవత్సరాల వరకు వెస్టింగ్ కాలాన్ని నిర్ణయించడం ద్వారా ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. అయితే ఈ షేర్లు పూర్తిగా పనితీరు ఆధారంగానే కేటాయించబడతాయి. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించని సందర్భంలో ఉద్యోగులకు తగ్గించిన షేర్లే లభించే అవకాశం ఉంటుంది. ఎవరికెంత షేర్లు ఇవ్వాలన్నది ప్రత్యేక కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని ఇతర విమానయాన సంస్థల్లో ఇలాంటి పథకాలు అమల్లో ఉండగా, ఎయిరిండియాలో కూడా ఈ నిర్ణయం ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపనుందని భావిస్తున్నారు. టాటా గ్రూప్ చేతుల్లోకి వచ్చిన తర్వాత సంస్థను మరింత బలంగా నిలబెట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో ఇది మరో కీలక అడుగుగా పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# బంగారం ధరలు స్థిరం..




హైదరాబాద్, మన గళం: దేశీయ మార్కెట్లో బంగారం ధరలు ఈరోజు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా పెరిగిన పసిడి ధరలు కాస్త శాంతించడంతో కొనుగోలుదారులకు స్వల్ప ఊరట లభించింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా అమెరికాఇరాన్ సంబంధాలు మరియు ఇజ్రాయెల్ దాడుల ప్రభావం బంగారం ధరలపై పడింది. ఈ నేపథ్యంలో గతంలో ధరలు పెరిగినా, గ్లోబల్ మార్కెట్లో లాభాల స్వీకరణ కారణంగా ఇప్పుడు కొంత తగ్గుదల కనిపిస్తోంది. అంతర్జాతీయంగా స్పాట్ బంగారం ధర ఔన్సుకు సుమారు 44 డాలర్లు తగ్గి ప్రస్తుతం 4718 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అదే సమయంలో వెండి ధరలు కూడా పడిపోయాయి. స్పాట్ వెండి ధర 2.61 శాతం తగ్గి ఔన్సుకు 74.27 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఈరోజు బంగారం ధరలు మార్పులేకుండా ఉన్నాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,52,840గా ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,40,100 వద్ద కొనసాగుతోంది. గత రెండు రోజుల పెరుగుదల తర్వాత ధరలు స్థిరపడటం గమనార్హం. ఇక వెండి ధర కూడా స్థిరంగానే ఉంది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,65,000గా కొనసాగుతోంది. ముందు రోజు రూ.5,000 పెరిగినప్పటికీ ప్రస్తుతం అదే స్థాయిలో ఉంది.

బులియన్ మార్కెట్లో ధరలు రోజంతా మారే అవకాశం ఉండటంతో, బంగారం కొనుగోలు చేసే ముందు స్థానిక మార్కెట్లో తాజా ధరలను తెలుసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఉచిత ఛానెళ్లకు షాక్.. రుసుము విధించే ఆలోచన

న్యూఢిల్లీ, మన గళం: దేశంలో స్మార్ట్ టీవీల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఉచితంగా అందుబాటులో ఉన్న టీవీ ఛానెళ్లపై కొత్త మార్పులు రావచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. టెలికాం నియంత్రణ సంస్థ తీసుకోబోయే కీలక నిర్ణయం వల్ల సుమారు 150కి పైగా ఉచిత ఛానెళ్లు ఇకపై రుసుము పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం కోట్లాది మంది వినియోగదారులు ఇంటర్నెట్ ఆధారిత యాప్‌ల ద్వారా ఎలాంటి అదనపు చార్జీలు లేకుండానే ఈ ఛానెళ్లను వీక్షిస్తున్నారు. అయితే ఈ వ్యవస్థపై నియంత్రణ అవసరమని భావించిన అధికారులు కొత్త నిబంధనలు తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కేబుల్, డీటీహెచ్ సేవలందించే సంస్థలు ఛానెళ్ల ప్రసారానికి రుసుములు వసూలు చేస్తూ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ స్మార్ట్ టీవీ యాప్‌ల ద్వారా ప్రసారం అవుతున్న ఉచిత ఛానెళ్లకు అలాంటి కట్టుబాట్లు లేకపోవడం వల్ల అసమాన పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తేడాను తొలగించడానికి యాప్‌లను కూడా నియంత్రణలోకి తీసుకురావాలని ప్రతిపాదనలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా కోట్లలో ఉన్న స్మార్ట్ టీవీ వినియోగదారులు ఈ మార్పులతో ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కేబుల్ లేదా డీటీహెచ్ కనెక్షన్ లేకుండా పూర్తిగా ఉచిత ఛానెళ్లపై ఆధారపడుతున్న వారికి ఇది అదనపు భారం కావచ్చని భావిస్తున్నారు. మరోవైపు, కొత్త తరానికి చెందిన యువత ఇప్పటికే ఓటీటీ వేదికలను ఎక్కువగా వినియోగిస్తున్నందున వారికి ఈ మార్పు ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం త్వరలో వెలువడే అవకాశం ఉండగా, అమలులోకి వస్తే దేశంలో టీవీ వీక్షణ విధానంలో మరో పెద్ద మార్పు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.




# రిటైర్మెంట్ తర్వాత హోమ్ లోన్ సాధ్యమేనా?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): అరవై ఏళ్ల వయస్సు దాటిన తర్వాత గృహ రుణం పొందడం కష్టమనే అభిప్రాయం చాలా మందిలో ఉన్నా, సరైన ప్రణాళికతో అది సాధ్యమేనని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ దశలో బ్యాంకులు రుణాల మంజూరులో అనుసరించే ప్రమాణాలు యువకుల కంటే భిన్నంగా ఉంటాయి. భవిష్యత్ ఆదాయం కంటే ప్రస్తుతం ఉన్న స్థిరమైన ఆదాయం, రుణాన్ని తక్కువ కాలంలో తిరిగి చెల్లించే సామర్థ్యంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తారు. పదవీ విరమణ తర్వాత క్రెడిట్ ప్రొఫైల్ ప్రాధాన్యం మరింత పెరుగుతుంది. సమయానికి బకాయిలను చెల్లించడం, క్రెడిట్ వినియోగాన్ని సక్రమంగా కొనసాగించడం వంటి అంశాలు బ్యాంకులకు విశ్వాసాన్ని కలిగిస్తాయి. చిన్న మొత్తాల్లో అయినా క్రెడిట్ కార్డు వినియోగించి, సమయానికి చెల్లింపులు చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను నిరూపించుకోవచ్చు. అదే విధంగా పెన్షన్, అద్దె ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ వంటి నిరంతర ఆదాయ వనరులు ఉంటే రుణం పొందే అవకాశాలు పెరుగుతాయి. ఇంకా సహ దరఖాస్తుదారు అంశం కూడా కీలకంగా మారుతుంది. తక్కువ వయస్సు గల, స్థిరమైన ఆదాయం ఉన్న కుటుంబ సభ్యుడిని సహ దరఖాస్తుదారుగా చేర్చితే బ్యాంకుల రిస్క్ తగ్గి రుణం ఆమోదం సులభమవుతుంది. అలాగే ఎక్కువ డౌన్ పేమెంట్ చెల్లించడం ద్వారా రుణ మొత్తాన్ని తగ్గిస్తే, ఈఎంఐ భారం కూడా తగ్గుతుంది. మొత్తంగా చూసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత హోమ్ లోన్ పొందడం పూర్తిగా అసాధ్యం కాదు. స్థిరమైన ఆదాయం, మంచి క్రెడిట్ చరిత్ర, సరైన ఆర్థిక ప్రణాళిక ఉంటే ఈ దశలో కూడా గృహ రుణం సులభంగా పొందవచ్చు.




# విజయ రహస్యం ఇదే..
# ప్రముఖుల అలవాటు ఏమిటంటే



హైదరాబాద్, మన గళం: చాలా మంది కెరీర్‌లో విజయం అంటే కేవలం ఉద్యోగాలు మారడం లేదా ప్రమోషన్లు పొందడం అని భావిస్తారు. అయితే దీర్ఘకాలిక విజయం అనేది మనం ప్రతిరోజూ అలవాటు చేసుకునే చిన్న చిన్న విషయాలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న వ్యాపారవేత్తలు, నాయకుల విజయానికి ఒక ముఖ్యమైన కారణం పుస్తకాలు చదవడం అనే అలవాటు అని తెలుస్తోంది. ప్రపంచంలో అత్యంత సంపన్నులలో ఒకరైన ఎలాన్ మస్క్‌తో పాటు ఇతర ప్రముఖ నాయకులు కూడా తమ విజ్ఞానానికి ప్రధాన మూలం పుస్తకాలేనని పలుమార్లు వెల్లడించారు. ప్రముఖ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన జాన్ మెక్ నీల్ వంటి వారు కూడా అగ్రశ్రేణి నాయకులతో కలిసి పనిచేసేటప్పుడు ఒక విషయం గమనించినట్లు తెలిపారు. వారు ఎంత బిజీగా ఉన్నా చదవడానికి ప్రతిరోజూ సమయం కేటాయిస్తారని పేర్కొన్నారు. ఇది కేవలం సమాచారం కోసం మాత్రమే కాకుండా, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు, మానసికంగా చురుకుగా ఉండేందుకు దోహదపడుతుందని చెప్పారు. నిరంతరం చదివే అలవాటు వల్ల కొత్త విషయాలపై అవగాహన పెరుగుతుంది. వివిధ రంగాల గురించి విస్తృతమైన దృష్టికోణం ఏర్పడుతుంది. ఇది ఉద్యోగాల్లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను పరిష్కరించడంలో, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తాజా సర్వేలు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి. అధిక సంపన్నులలో సాధారణంగా కనిపించే అలవాట్లలో పుస్తకాలు చదవడం ఒకటిగా గుర్తించారు. అయితే ప్రస్తుతం సాధారణ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చదివే అలవాటు తగ్గిపోతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత వంటి నైపుణ్యాలు తగ్గే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. చదివే అలవాటు ఉన్నవారు ఇతరులతో పోలిస్తే విభిన్నంగా ఆలోచించి, జీవితంలో ముందుకు సాగగలరని పేర్కొంటున్నారు.

# చిన్న సిలిండర్లకు పెరిగిన సరఫరా




న్యూఢిల్లీ, మన గళం: దేశంలో గ్యాస్ కొరత పరిస్థితుల మధ్య కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల సిలిండర్ల సరఫరాను మరింతగా పెంచాలని కీలక నిర్ణయం తీసుకుంది. విదేశీ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్, ఇంధన సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆయిల్ సంస్థలు ఇప్పటికే చిన్న సిలిండర్లను మార్కెట్లోకి తీసుకురాగా, వీటికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో సరఫరాను విస్తరించి మరింత మందికి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.మార్చి చివరి వారంలో ప్రారంభమైన ఈ చిన్న సిలిండర్ల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు లక్షల సంఖ్యలో అమ్మకాలు జరగగా, రోజుకు భారీగా డిమాండ్ నమోదవుతోంది. ప్రత్యేకంగా వలస కార్మికులు, విద్యార్థులు, చిన్న కుటుంబాలు ఈ సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నాయి. ఈ సిలిండర్లను కొనుగోలు చేయడానికి పెద్దగా పత్రాలు అవసరం లేకపోవడం కూడా వినియోగదారులకు సౌకర్యంగా మారింది. గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాల్లో సులభంగా లభించడం వల్ల ప్రజలు వీటిని ఎంచుకుంటున్నారు.ఇదే సమయంలో పైప్ గ్యాస్ వినియోగాన్ని కూడా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఇటీవల లక్షల సంఖ్యలో కొత్త కనెక్షన్లు మంజూరు చేయడం జరిగింది. అయితే వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే పెద్ద సిలిండర్ల కొరత ఇంకా కొనసాగుతుండటంతో హోటళ్లు, రెస్టారెంట్లు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని చోట్ల అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో చిన్న సిలిండర్ల సరఫరా పెంపు ద్వారా సాధారణ వినియోగదారులకు ఉపశమనం కల్పించడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# రూ.15 వేలలో రెడ్‌మీ 5జీ ఫోన్

హైదరాబాద్, మన గళం: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ రెడ్‌మీ భారత మార్కెట్లో కొత్త 5జీ ఫోన్‌ను విడుదల చేసింది. 'రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ' పేరుతో వచ్చిన ఈ ఫోన్ తక్కువ ధరలోనే మంచి ఫీచర్లను అందిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా పదిహేనువేల రూపాయల లోపు ధరలో 5జీ సౌకర్యం కావాలనుకునే వారికి ఇది సరైన ఎంపికగా మారనుంది. ఈ ఫోన్‌లో 6.9 అంగుళాల హెచ్‌డీ ప్లస్ ఎల్సీడీ డిస్‌ప్లేను అమర్చారు. ఇది 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌తో పాటు 800 నిట్స్ వెలుతురు సామర్థ్యాన్ని కలిగి ఉంది. పనితీరు కోసం 6 నానోమీటర్ ఆక్టా కోర్ ప్రాసెసర్‌ను ఉపయోగించారు. తాజా ఆండ్రాయిడ్ 16 ఆధారిత హైపర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై ఈ ఫోన్ పనిచేయడం విశేషం. బ్యాటరీ విషయంలో 6,300 ఎంఏహెచ్ సామర్థ్యంతో భారీ బ్యాటరీను అందించారు. ఇది 15 వాట్ల చార్జింగ్‌కు మద్దతు ఇస్తుంది. కెమెరా విషయానికొస్తే, వెనుక భాగంలో 32 మెగాపిక్సెల్ డ్యూయల్ కెమెరా వ్యవస్థను అమర్చారు. ముందుభాగంలో సెల్ఫీల కోసం 8 మెగాపిక్సెల్ కెమెరా ఉంది. నాలుగు జీబీ ర్యామ్‌తో పాటు 64 జీబీ, 128 జీబీ నిల్వ సామర్థ్యాలతో ఈ ఫోన్ లభిస్తుంది. తక్కువ ధరలో ఎక్కువ బ్యాటరీ బ్యాకప్, 5జీ కనెక్టివిటీ వంటి ముఖ్యమైన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఫోన్‌ను రూపకల్పన చేశారు.

ధర విషయానికొస్తే, రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ ప్రారంభ ధర పదకొండు వేల నాలుగు వందల తొంభై తొమ్మిది రూపాయలుగా నిర్ణయించారు. ఈ ఫోన్ విక్రయాలు ఏప్రిల్ 15 నుండి ప్రముఖ ఆన్‌లైన్ వేదికలలో ప్రారంభం కానున్నాయి



# సంపాదకీయం

## సోషల్ మీడియా ప్రభావం

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అనేది కేవలం ఒక కమ్యూనికేషన్ సాధనంగానే కాకుండా, సమాజ గమనాన్ని శాసించే ఒక శక్తివంతమైన వేదికగా అవతరించింది. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), వాట్సాప్ మరియు ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాలు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చేశాయి. అయితే, ఈ సౌలభ్యంతో పాటే 'తప్పుడు సమాచారం' అనే పెద్ద ముప్పు కూడా వచ్చి పడింది. ఒక వార్త నిజమో కాదో తెలుసుకునే లోపే అది లక్షలాది మందికి చేరిపోయి, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. నేడు సోషల్ మీడియాలో వస్తున్న అతిపెద్ద సవాలు 'డీప్‌ఫేక్' సాంకేతికత. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఒక వ్యక్తి ముఖాన్ని లేదా గొంతును మరొకరిలా మార్చడం ద్వారా సృష్టిస్తున్న ఈ వీడియోలు అచ్చం నిజంలాగే కనిపిస్తున్నాయి. ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులపై ఇటువంటి తప్పుడు వీడియోలను సృష్టించి వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి లేదా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత ప్రతిష్టకే కాకుండా, దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోంది.

సోషల్ మీడియా సంస్థలు అనుసరించే 'అల్గారిథమ్స్' మరొక ఆందోళనకరమైన అంశం. యూజర్లు దేనినైతే ఇష్టపడతారో, అటువంటి పోస్టులనే పదేపదే చూపించడం వల్ల ప్రజల ఆలోచనా దృక్పథం ఒకే వైపుకు మొగ్గు చూపుతోంది. దీనిని 'ఎకో ఛాంబర్' అని పిలుస్తారు. దీనివల్ల భిన్నమైన అభిప్రాయాలను గౌరవించే సంస్కృతి తగ్గిపోయి, సమాజంలో వర్గాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఒకే రకమైన భావజాలం ఉన్న వార్తలను చదవడం వల్ల ప్రజలు వాస్తవాలను విశ్లేషించే శక్తిని కోల్పోతున్నారు.

ప్రస్తుత 2026వ సంవత్సరంలో డిజిటల్ అక్షరాస్యత అనేది కేవలం ఇంటర్నెట్ వాడటం మాత్రమే కాదు. అందులో వచ్చే సమాచారాన్ని ప్రశ్నించడం మరియు విశ్లేషించడం కూడా అందులో భాగమే. ఒక వార్త వైరల్ అవుతున్నప్పుడు దాని మూలాలను వెతకడం ప్రతి యూజర్ బాధ్యత. అధికారిక వార్తా సంస్థల నుండి వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలి. అనామక వ్యక్తులు లేదా తెలియని వెబ్‌సైట్ల నుండి వచ్చే సమాచారాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేసే ముందు ఒక్క నిమిషం ఆలోచించడం ద్వారా చాలా వరకు నష్టాన్ని నివారించవచ్చు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారం వల్ల అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. తప్పుడు పుకార్ల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరం. సమాచార ప్రవాహాన్ని నియంత్రించడం కష్టమైనప్పటికీ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం క్లిక్స్ లేదా వ్యూస్ కోసం తప్పుడు శీర్షికలతో వార్తలను ప్రచారం చేసే పోర్టల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రభుత్వాలు కూడా ఈ ముప్పును గుర్తించి కొత్త ఐటీ చట్టాలను రూపొందిస్తున్నాయి. ఏఐ ద్వారా తయారైన కంటెంట్‌కు తప్పనిసరిగా అనే ట్యాగ్ ఉండాలనే నిబంధనలు వస్తున్నాయి. సోషల్ మీడియా కంపెనీలు కూడా తమ ప్లాట్‌ఫామ్స్ నుండి తప్పుడు సమాచారాన్ని త్వరగా తొలగించేలా చర్యలు తీసుకోవాలి. టెక్నాలజీ ద్వారా వచ్చే సమస్యలను మళ్ళీ టెక్నాలజీ సహాయంతోనే పరిష్కరించేందుకు 'ఫ్యాక్ట్-చెక్' బాట్స్ వంటి ఆధునిక సాధనాలను అభివృద్ధి చేయాలి.

విద్యార్థులు మరియు యువతపై సోషల్ మీడియా ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. రంగుల లోకంలో విహరిస్తూ వారు వాస్తవ ప్రపంచానికి దూరమవుతున్నారు. ఆన్‌లైన్‌లో చూసే ప్రతిదీ నిజం కాదని వారికి చిన్నప్పటి నుంచే నేర్పించాలి. పాఠశాలల పాఠ్యాంశాల్లో 'మీడియా లిటరసీ'ని ఒక భాగంగా చేర్చడం ద్వారా భవిష్యత్తు తరాలను చైతన్యవంతం చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం మన చేతుల్లో ఉన్నట్లే కాదు, దాన్ని ఎలా వాడాలో తెలియకపోతే అది మనల్ని ప్రమాదంలోకి నెట్టే అవకాశం కూడా ఉంది. కార్పొరేట్ సంస్థలు తమ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి కూడా సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడుతున్నాయి. నెగటివ్ క్యాంపెయిన్స్ ద్వారా పోటీ సంస్థలను దెబ్బతీసే ధోరణి కూడా నేడు పెరిగింది. దీనిని అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీ విభాగం నిరంతరం నిఘా ఉంచాలి. వినియోగదారులు కూడా తాము చూసే ప్రకటనలు లేదా ఆఫర్ల వెనుక ఉన్న నిజానిజాలను సరిచూసుకోవాలి. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో వ్యక్తిగత డేటా భద్రత గురించి కూడా అవగాహన పెంచుకోవాలి. వార్తా సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతను మరువకూడదు. సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతున్నప్పుడు, దాని విశ్వసనీయతను తనిఖీ చేసిన తర్వాతే ప్రచురించాలి. వేగంగా వార్తను అందించాలనే పోటీలో వాస్తవాలను విస్మరిస్తే మీడియా పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుంది. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం ద్వారా నిజానిజాలను వెలికితీసి ప్రజల ముందు ఉంచడం ద్వారానే సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టవచ్చు. సోషల్ మీడియా అనేది ఒక పదునైన కత్తి వంటిది. దానిని సక్రమంగా ఉపయోగిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది, కానీ దుర్వినియోగం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. విజ్ఞతతో వ్యవహరించడం, నిజానిజాలను విశ్లేషించడం మరియు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా మెలగడం ద్వారానే మనం ఒక మెరుగైన సమాజాన్ని నిర్మించగలం. సాంకేతికతను మన ప్రగతికి సోపానంగా మలచుకోవాలే తప్ప, దాని వల్ల కలిగే భ్రమల్లో చిక్కుకోకూడదు.

# అణగారిన వర్గాల ధ్రువతార

**భారత సామాజిక విప్లవకారుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర - రాజ్యాంగ నిర్మాణంలో అద్వితీయ పాత్ర- జ్ఞాన సముపార్జనలో మేటి మేధావి**



డెస్క్, మన గళం: భారతదేశ సామాజిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసిన మహా మనీషి డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్. 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మౌ గ్రామంలో జన్మించిన ఆయన, బాల్యం నుంచే కుల వివక్షను మరియు అంటరానితనం వల్ల ఎదురయ్యే తీరని అవమానాలను అనుభవించారు. పాఠశాల గది బయట కూర్చోవడం, తాగునీటి కోసం ఇతరుల సహాయం అర్థించడం వంటి ఘటనలు ఆయనను ఎంతగానో కలిచివేసాయి. అయితే, ఈ వివక్షే ఆయనను ఒక గొప్ప పోరాటయోధుడిగా మార్చింది. చదువు ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని నమ్మిన ఆయన, తన ప్రతిభతో ఉన్నత విద్య వైపు అడుగులు వేశారు.

అంబేద్కర్ విద్యా ప్రస్థానం ప్రపంచానికే ఒక పాఠం. బరోడా మహారాజు ఆర్థిక సహాయంతో కొలంబియా విశ్వవిద్యాలయం మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి అర్థశాస్త్రం, న్యాయశాస్త్రం మరియు రాజనీతి శాస్త్రాల్లో పట్టాలను అందుకున్నారు. ఒకే కాలంలో రెండు డాక్టరేట్లు సాధించిన అరుదైన మేధావి ఆయన. విదేశాల్లో గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలిగే అవకాశం ఉన్నప్పటికీ, తన సోదర సమానులైన భారతీయుల కోసం, అణచివేతకు గురవుతున్న వర్గాల కోసం తిరిగి తన మాతృభూమికి చేరుకున్నారు. అప్పటి నుంచి ఆయన సామాజిక సమానత్వం కోసం సమరశంఖం పూరించారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశ భవిష్యత్తును నిర్ణయించే పవిత్ర గ్రంథం 'రాజ్యాంగం' రచనలో అంబేద్కర్ పోషించిన పాత్ర చిరస్మరణీయం. రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా ఆయన వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, భారతీయ భిన్నత్వానికి సరిపోయేలా పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. కుల, మత, లింగ వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమానమైన ఓటు హక్కు, వాక్ స్వాతంత్ర్యం మరియు జీవించే హక్కును కల్పించడంలో ఆయన చూపిన చొరవ అమోఘం. అందుకే ఆయనను ప్రపంచం 'భారత రాజ్యాంగ శిల్పి'గా నేటికీ కొనియాడుతోంది. అంబేద్కర్ కేవలం రాజకీయ నాయకుడే కాదు, ఒక గొప్ప ఆర్థికవేత్త కూడా. ఆయన రాసిన 'ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ' అనే పరిశోధనా గ్రంథం ఆధారంగానే భారత రిజర్వ్ బ్యాంక్ ఆవిర్భవించింది. వ్యవసాయ రంగంలో సంస్కరణలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మరియు విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో ఆయన ఆలోచనలు దేశాభివృద్ధికి పునాదులు వేశాయి. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ వంటి భారీ ప్రాజెక్టుల వెనుక ఆయన దూరదృష్టి ఉంది. దేశం ఆర్థికంగా బలోపేతం కావాలంటే పారిశ్రామికీకరణ మరియు శాస్త్రీయ దృక్పథం అవసరమని ఆయన ఎప్పుడూ నొక్కి చెప్పేవారు.

సామాజిక సంస్కర్తగా ఆయన చేసిన కృషి వెలకట్టలేనిది. మహిళల హక్కుల కోసం 'హిందూ కోడ్ బిల్లు'ను ప్రవేశపెట్టి వారి సాధికారతకు బాటలు వేశారు. ఆస్తిలో మహిళలకు వాటా, విడాకులు తీసుకునే హక్కు వంటి విప్లవాత్మక అంశాలను ఆ బిల్లులో చేర్చారు. కార్మికుల సంక్షేమం కోసం పని గంటలను తగ్గించడం, సెలవుల సౌకర్యం కల్పించడం వంటి అనేక చట్టాలను ఆయన మంత్రిగా ఉన్న సమయంలో తీసుకువచ్చారు. దళితులకు విద్య మరియు ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి నిరంతరం శ్రమించారు. హిందూ మతంలోని కుల వ్యవస్థ మరియు అంటరానితనంపై ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 1927లో మహద్ సత్యాగ్రహం ద్వారా దళితులకు మంచినీటి హక్కును కల్పించారు. ఆలయ ప్రవేశ పోరాటాల ద్వారా చైతన్యం నింపారు. అయితే, వ్యవస్థలో మార్పు రావడం లేదని గమనించిన ఆయన, తన జీవిత చరమాంకంలో బౌద్ధ మతాన్ని స్వీకరించారు. మతం మారడం అంటే ఆత్మాభిమానాన్ని పొందడమని ఆయన భావించారు. తనతో పాటు లక్షలాది మంది అనుచరులకు నాగపూర్‌లో బౌద్ధ దీక్షను ఇచ్చి, వారికి ఒక నూతన మార్గాన్ని చూపించారు.

అంబేద్కర్ ఒక గొప్ప రచయిత మరియు పాత్రికేయుడు. 'మూక్ నాయక్', 'బహిష్కృత భారత్' వంటి పత్రికల ద్వారా సామాజిక సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. ఆయన రాసిన ప్రసంగాలు, వ్యాసాలు నేటికీ సామాజిక శాస్త్రవేత్తలకు దిక్సూచిగా ఉన్నాయి. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే ఆయన నినాదం తరతరాల యువతకు స్ఫూర్తినిస్తోంది. అణగారిన వర్గాల ప్రజలు ఆత్మాభిమానంతో బతకడం నేర్చుకోవాలని ఆయన ఎల్లప్పుడూ కోరుకునేవారు. ఆయన ఆలోచనలు కేవలం ఒక వర్గానికి మాత్రమే కాక, మొత్తం దేశ శ్రేయస్సును కాంక్షించేవిగా ఉంటాయి. 1956 డిసెంబర్ 6న అంబేద్కర్ ఈ లోకాన్ని విడిచి వెళ్ళినా, ఆయన అందించిన రాజ్యాంగం మరియు సిద్ధాంతాలు నిరంతరం జీవిస్తూనే ఉంటాయి. 1990లో భారత ప్రభుత్వం ఆయనకు మరణానంతరం 'భారతరత్న' పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. నేడు భారతదేశం ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా నిలబడటానికి ఆయన వేసిన పునాదులే కారణం. అంబేద్కర్ జయంతి కేవలం ఒక ఉత్సవం కాదు, అది సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం మనందరి బాధ్యతను గుర్తుచేసే రోజు. ఆయన ఆశయాలను గౌరవిస్తూ సాగడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి.



# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు




ముంబై, మన గళం: పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. రోజంతా ఒడిదుడుకులకు లోనైన సూచీలు చివర్లో కొంత కోలుకున్నప్పటికీ నష్టాలనే నమోదు చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 702.68 పాయింట్లు తగ్గి 76,847.57 వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 207.95 పాయింట్లు పడిపోయి 23,842.65 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే భారీ అమ్మకాల ఒత్తిడితో సూచీలు గణనీయంగా పడిపోయాయి. అయితే మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు పెరగడంతో నష్టాలను కొంతవరకు తగ్గించుకున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను పెట్టుబడిదారులు జాగ్రత్తగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఈ పరిస్థితులు ఇన్వెస్టర్ల మనోభావాలను ప్రభావితం చేశాయి. రంగాల వారీగా పరిశీలిస్తే ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లు కూడా బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. అయితే మెటల్ రంగం ఇతర రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల మధ్య రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం కొంత ఊరటనిచ్చింది. నిఫ్టీ లో కొన్ని షేర్లు లాభాలు నమోదు చేసినప్పటికీ, మరికొన్ని ప్రధాన షేర్లు గణనీయంగా నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు గరిష్టంగా పడిపోయాయి.

# ఆధార్ లేకుండానే కేవైసీ.. కొత్త విధానం




న్యూఢిల్లీ, మన గళం:దేశంలో ఆర్థిక సేవలను సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవైసీ ప్రక్రియ కోసం ఆధార్, పాన్ వంటి గుర్తింపు పత్రాలు తప్పనిసరి కాగా, ఇకపై వాటి అవసరం లేకుండానే కేవైసీ పూర్తి చేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానాన్ని సీకేవైసీగా పిలుస్తారు. దీనిలో ప్రతి వ్యక్తికి ప్రత్యేకంగా ఒక యూనిక్ నెంబర్ కేటాయించబడుతుంది. ఈ నెంబర్ ద్వారా మాత్రమే కేవైసీ వివరాలు ధృవీకరించబడతాయి.కేవైసీ అంటే వ్యక్తి నిజస్వరూపాన్ని నిర్ధారించే ప్రక్రియగా బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలు దీన్ని తప్పనిసరిగా అమలు చేస్తుంటాయి. ఇప్పటివరకు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను సమర్పించి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి వచ్చేది. అయితే సీకేవైసీ అమల్లోకి రావడంతో ఈ విధానం మరింత సులభంగా మారింది.ఈ సీకేవైసీ నెంబర్ మొత్తం పద్నాలుగు అంకెలతో ఉంటుంది. దీనిని ఆర్థిక శాఖకు చెందిన కేంద్ర సంస్థ నిర్వహిస్తుంది. ఒకసారి ఈ నెంబర్ జనరేట్ అయిన తర్వాత, అదే నెంబర్‌ను ఉపయోగించి వివిధ ఆర్థిక సేవల్లో కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవచ్చు. ప్రతిసారి కొత్తగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు.ఈ నెంబర్ పొందడం కూడా చాలా సులభమే.

# సొరకాయ వేసవిలో ఆరోగ్యానికి సహజ వరం




మన గళం, ఆరోగ్యం : వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచే ఆహారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ క్రమంలో సొరకాయ (బాటిల్ గోర్డ్) ఆరోగ్యకరమైన కూరగాయగా ప్రజల్లో విస్తృతంగా వినియోగంలోకి వస్తోంది. తక్కువ కాలరీలు, అధిక నీటి శాతం కలిగి ఉండటం వల్ల ఇది వేసవిలో తీసుకోవడానికి ఉత్తమ ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. సొరకాయలో ఫైబర్, విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి సొరకాయతో చేసిన వంటకాలు మంచి ఆప్షన్‌గా ఉంటాయి. శరీరంలో నీటి శాతం నిలబెట్టడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సొరకాయను కూర, పప్పు, సూప్, జ్యూస్ రూపాల్లో తీసుకోవచ్చు. ముఖ్యంగా సొరకాయ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. అయితే చేదుగా ఉన్న సొరకాయను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి సొరకాయ ఆరోగ్యానికి హానికరం కావచ్చు. సరైన విధంగా ఎంచుకుని, మితంగా తీసుకుంటే సొరకాయ వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడే సహజ ఆహారంగా నిలుస్తుంది.

# సపోటా పండు: రుచికే కాదు.. ఆరోగ్యానికి అమూల్యం




మన గళం, ఆరోగ్యం : ప్రకృతి మనకు అందించిన తీపి వరంగా నిలిచే సపోటా పండు, రుచితో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సాధారణంగా చిక్కూ అని పిలిచే ఈ పండు, అన్ని వయసుల వారికీ ఇష్టమైనదిగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల దాకా సులభంగా లభించే ఈ పండు, శరీరానికి అవసరమైన శక్తిని తక్షణమే అందించే సహజ ఆహారంగా నిలుస్తోంది. సపోటాలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్ ఏ, విటమిన్ సి వంటి ముఖ్య పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఫైబర్ అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. అదేవిధంగా పొటాషియం వల్ల రక్తపోటు నియంత్రణలో సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యానికి కూడా సపోటా ఎంతో మేలు చేస్తుంది. విటమిన్ సి కారణంగా చర్మానికి తేజస్సు పెరుగుతుంది. చలి, దగ్గు వంటి సమస్యల సమయంలో కూడా సపోటా తీసుకోవడం వల్ల గొంతుకు ఉపశమనం లభిస్తుంది. అందుకే వైద్య నిపుణులు దీన్ని సహజ ఆరోగ్య పండుగా సూచిస్తున్నారు. అయితే సపోటాను పరిమితంగా మాత్రమే తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే బరువు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. పచ్చిగా ఉన్న సపోటాను తినకూడదని సూచిస్తున్నారు. సరైన మోతాదులో తీసుకుంటే సపోటా పండు ఆరోగ్యానికి నిజమైన వరంగా నిలుస్తుంది.

# ముఖానికి పుచ్చకాయ ఫేస్‌ప్యాక్: వేసవిలో చర్మానికి సహజ చల్లదనం

– ఎండలో చర్మాన్ని కాపాడే సహజ పరిష్కారం – హైడ్రేషన్‌తో గ్లో పెంచే పుచ్చకాయ –ఇంట్లోనే సులభంగా తయారు చేసే ఫేస్‌ప్యాక్



మన గళం, ఆరోగ్యం : వేసవి కాలంలో పెరుగుతున్న ఎండ కారణంగా చర్మం ఎండిపోయి, నిస్సారంగా మారే సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సహజ పదార్థాలతో తయారు చేసే ఫేస్‌ప్యాక్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. అందులో ముఖ్యంగా పుచ్చకాయ ఫేస్‌ప్యాక్ చర్మానికి చల్లదనం ఇవ్వడంలో, తేమను నిలుపుకోవడంలో ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. పుచ్చకాయలో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల చర్మాన్ని హైడ్రేట్ చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే విటమిన్ ఏ, విటమిన్ సి ఉండటం వల్ల చర్మానికి కాంతి పెరుగుతుంది. సూర్యకిరణాల వల్ల కలిగే టాన్, మచ్చలను తగ్గించడంలో కూడా పుచ్చకాయ సహాయపడుతుంది. సహజ గుణాల వల్ల ఇది అన్ని రకాల చర్మాలకు సరిపోతుంది. ఈ ఫేస్‌ప్యాక్ తయారు చేయడం చాలా



సులభం. పుచ్చకాయ ముద్దను తీసుకుని కొద్దిగా తేనె లేదా పెరుగు కలిపి ముఖానికి అప్లై చేయాలి. 1520 నిమిషాలు ఉంచి తర్వాత చల్లని నీటితో కడిగితే చర్మం తాజాగా, మృదువుగా మారుతుంది. వారానికి 23 సార్లు వాడితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అయితే ఏ ఫేస్‌ప్యాక్ అయినా వాడే ముందు చిన్న పాచ్ టెస్ట్ చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చర్మానికి అలర్జీ లేకుండా చూసుకోవాలి. సరైన విధంగా వాడితే పుచ్చకాయ ఫేస్‌ప్యాక్ వేసవిలో చర్మానికి సహజ అందాన్ని అందించే ఉత్తమ మార్గంగా నిలుస్తుంది.

# వేసవిలో ఆరోగ్యానికి మేలు చేసే పానీయాలు



మన గళం, ఆరోగ్యం : వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా శరీరం త్వరగా నీరసం చెందుతుంది. దాహం, అలసట, డీహైడ్రేషన్ వంటి సమస్యలు అధికంగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో శరీరానికి చల్లదనం ఇచ్చే, పోషకాలు అందించే సహజ పానీయాలను తీసుకోవడం చాలా అవసరం. నిపుణులు కూడా వేసవిలో కార్బొనేటెడ్ డ్రింక్స్ కంటే సహజ పానీయాలనే సూచిస్తున్నారు. కొబ్బరి నీరు వేసవిలో అత్యుత్తమ పానీయంగా చెప్పుకోవచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదేవిధంగా మజ్జిగ కూడా శరీరానికి చల్లదనం అందించి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నిమ్మరసం విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పుచ్చకాయ జ్యూస్ శరీరంలో నీటి శాతాన్ని నిలబెట్టడంలో సహాయపడుతుంది. లస్సీ కూడా వేసవిలో శక్తిని ఇచ్చే మంచి పానీయం. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు అలసటను తగ్గిస్తుంది. అలాగే జొన్న గంజి, రాగి మాల్ట్ వంటి సంప్రదాయ పానీయాలు కూడా శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. వీటిలో సహజ ఖనిజాలు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. అయితే చక్కెర అధికంగా ఉన్న పానీయాలను తగ్గించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. బయట లభించే కలర్ డ్రింక్స్, సోడాలు శరీరానికి హానికరం కావచ్చు. సహజ పదార్థాలతో ఇంట్లో తయారు చేసుకునే పానీయాలే ఉత్తమం. సరైన పానీయాలను ఎంచుకుంటే వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కొనడం సులభమవుతుంది.



# పాలకూరతో ఆరోగ్య విప్లవం: రోజువారీ ఆహారంలో ఆకుకూరల ప్రాధాన్యం పెరుగుతోంది

- పోషకాల ఖజానాగా నిలుస్తున్న పాలకూర
- రక్తహీనత, కంటి సమస్యలకు సహజ పరిష్కారం
- ప్రతి ఇంటి వంటల్లో పెరుగుతున్న వినియోగం



మన గళం, ఆరోగ్యం : ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సహజ ఆహారాల వైపు మళ్లుతున్నారు. ఈ క్రమంలో పాలకూర వంటి ఆకుకూరలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతోంది. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలను అందించే పాలకూర, ప్రస్తుతం పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాల దాకా ప్రతి కుటుంబం ఆహారంలో కీలక స్థానాన్ని సంపాదిస్తోంది. ముఖ్యంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు పాలకూరను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. పాలకూరలో ఐరన్, కాల్షియం, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ ఏ, విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల ఇది శరీరానికి శక్తినిచ్చే ముఖ్య ఆహారంగా గుర్తింపు పొందింది. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారికి ఇది సహజ పరిష్కారంగా పనిచేస్తుంది. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు వంటి వర్గాలకు ఇది మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా పాలకూర కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో పాలకూర ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. అదేవిధంగా రోగనిరోధక శక్తిని పెంచి శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది. ఇటీవల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టే యువత కూడా పాలకూరతో తయారయ్యే వంటకాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. పాలకూర పప్పు, కూర, సూప్, స్మూతీ వంటి రూపాల్లో దీనిని వినియోగిస్తున్నారు. అయితే పాలకూరను సరైన విధంగా వండటం, శుభ్రంగా కడగటం చాలా అవసరం. ఎక్కువగా ఉడికిస్తే పోషకాలు తగ్గే ప్రమాదం ఉంది. అలాగే అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కొన్ని సందర్భాల్లో కిడ్నీ రాళ్ల సమస్యలు వచ్చే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి మితంగా, సరైన విధంగా తీసుకుంటే పాలకూర ఆరోగ్యానికి నిజమైన వరంగా నిలుస్తుంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# వేసవిలో అదృష్ట పరీక్షకు మృణాల్, పూజా హెగ్డే



హైదరాబాద్,మన గళం, సినిమా సినీ రంగంలో ఎప్పుడూ అంచనాలు పెట్టుకున్న సినిమాలు సక్సెస్ కాకపోవడం, అనూహ్యంగా ఇతర ప్రాజెక్టులు కెరీర్‌ను మలుపుతిప్పడం సహజమే. ప్రస్తుతం ఇదే పరిస్థితి హీరోయిన్లు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ల విషయంలో కనిపిస్తోంది. ఈ వేసవిలో బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో వీరిద్దరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. 'రెట్రో' తర్వాత మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న పూజా హెగ్డే, ఈ ఏడాది 'జననాయకన్'తో శుభారంభం అవుతుందని భావించారు. అయితే సెన్సార్ సమస్యలు, లీకుల కారణంగా ఆ సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొనడంతో, ప్రస్తుతం ఆమె పూర్తి దృష్టి బాలీవుడ్ చిత్రం 'హై జవానీతో ఇష్క్ హోనా హై'పై పడింది. ఈ సినిమాలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నారు. ముందుగా జూన్ 12న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని మే 22కే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో సమ్మర్ సీజన్‌లోనే పూజా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఇక అదే చిత్రంలో మరో హీరోయిన్‌గా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ ఇప్పటికే ఈ సమ్మర్‌లో 'డెకాయిట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, తొలి రోజు కలెక్షన్లు మాత్రం బాగానే వచ్చినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మృణాల్ చేసిన పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రకు మంచి పేరు రావడం ఆమెకు ప్లస్‌గా మారింది. అలాగే భవిష్యత్తులో అల్లు అర్జున్తో కలిసి నటించే అవకాశం ఉందనే టాక్ కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఆ అవకాశం కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని మృణాల్ తెలిపినట్లు సమాచారం. మరోవైపు 'హై జవానీతో ఇష్క్ హోనా హై' సినిమా విడుదల కోసం కూడా ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి ఈ వేసవిలో బాలీవుడ్ చిత్రం ద్వారా పూజా, మృణాల్ ఇద్దరూ తమ కెరీర్‌కు కొత్త ఊపు తీసుకురావాలని భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమా వారికి ఎంతవరకు సక్సెస్ తీసుకొస్తుందో చూడాలి.



## 'పెద్ది' లుక్‌లో మెరిసిన రామ్ చరణ్




హాంకాంగ్, మన గళం, సినిమా : మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఎస్క్వైర్ ఇండియా తాజా సంచిక కవర్ పేజీపై ఆయన స్టైలిష్ లుక్‌లో మెరిసారు. హాంకాంగ్‌లో నిర్వహించిన ఈ ప్రత్యేక ఫోటోషూట్‌లో చరణ్ తన కొత్త అవతారంతో అభిమానులను ఆకట్టుకున్నారు.ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ పెంచుకున్న కొత్త హెయిర్‌స్టైల్, గెటప్‌తోనే ఈ ఫోటోషూట్‌లో కనిపించడం విశేషం. ఈ లుక్‌లో ఆయన మరింత రగ్గడ్, స్టైలిష్‌గా కనిపిస్తూ గ్లోబల్ స్టార్ ఇమేజ్‌కు తగినట్టుగా మెప్పించారు. ఫోటోలు విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో సంచలనం సృష్టించాయి.రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ శక్తి"గా ఎస్క్వైర్ ఇండియా ప్రశంసించింది. భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గుర్తింపును ఈ కవర్ పేజీ మరింత బలపరిచిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫోటోషూట్ ద్వారా రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త స్టైల్‌లో ఆవిష్కరించామని పత్రిక ప్రతినిధులు తెలిపారు. సంప్రదాయం, ఆధునికత కలగలిపిన ఈ లుక్‌లో చరణ్ వ్యక్తిత్వం మరింత హైలైట్ అయిందని పేర్కొన్నారు. మొత్తానికి 'పెద్ది' సినిమా కోసం చేసిన ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో పాటు, అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై చోటు సంపాదించడం ద్వారా రామ్ చరణ్ మరోసారి తన గ్లోబల్ స్టార్డమ్‌ను నిరూపించుకున్నారు.

## హాట్ సమ్మర్‌లో చిన్న సినిమాల సందడి

హైదరాబాద్, మన గళం, సినిమా :ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. విలేజ్ కామెడీ ఎంటర్టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి. కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా కొత్త ప్రతిభను ప్రోత్సహించే ప్రయత్నంగా తెరకెక్కింది. 90ల నేపథ్యంలో రూపొందిన ఈ గ్రామీణ వినోదాత్మక చిత్రం అప్పటి జీవనశైలిని గుర్తు చేసేలా ఉంటుందని సమాచారం. కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తిరువీర్ నటిస్తున్న 'పాపం ప్రతాప్' సినిమా కూడా అదే రోజున విడుదల కానుంది. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట జీవితంలో నాలుగు రోజుల్లో జరిగే పరిణామాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కింది. కుటుంబ భావోద్వేగాలతో పాటు ప్రేమ అంశాలు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. యువ హీరో నాగశౌర్య నటించిన 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రం కూడా ఈ వారం విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున 'తెరచాప' అనే మరో చిన్న చిత్రం కూడా థియేటర్లలోకి రానుంది. మరోవైపు మలయాళ నటుడు టొవినో థామస్ నటించిన 'పల్లి చట్టంబి' చిత్రం ఏప్రిల్ 15న విడుదల కానుంది. 1950–60 దశకంలోని చారిత్రక నేపథ్యంలో రూపొందిన ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెలుగులోనూ విడుదలవుతోంది. యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలా గ్రామీణ నేపథ్యం, ప్రేమ కథలు, యాక్షన్ అంశాలతో విభిన్న జానర్లలో తెరకెక్కిన ఈ చిన్న సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానుండటం విశేషం. పెద్ద సినిమాల మధ్య పోటీ ఉన్నప్పటికీ మంచి కథ, సహజమైన నటన ఉంటే చిన్న సినిమాలు కూడా విజయాన్ని సాధించగలవని మేకర్స్ విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ మూడో వారం థియేటర్లలో చిన్న సినిమాల సందడి ఎలా ఉండబోతుందో చూడాలి.

## ఒంటరిగా సంతోషం.. పెళ్లిపై రామ్ క్లారిటీ

హైదరాబాద్, మన గళం, సినిమా : టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన పెళ్లి వార్తలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ ఆయన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో తరచూ చర్చ జరుగుతుండగా, తాజాగా తన మనసులోని భావాలను వెల్లడించారు. తనకు ఏకాంతంగా ఉండటం చాలా ఇష్టమని రామ్ స్పష్టం చేశారు. చిన్నప్పటి నుంచే ఈ అలవాటు ఉందని, ఖాళీ సమయం దొరికితే స్నేహితులతో గడపడం కంటే తనతో తాను గడపడం ద్వారానే ప్రశాంతతను పొందుతానని తెలిపారు. ఇది తాను ప్రత్యేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, తన సహజ స్వభావమని ఆయన పేర్కొన్నారు. అయితే తన జీవితంలోకి ఎవరైనా ప్రత్యేక వ్యక్తి వస్తే వారితో సమయం గడపడానికి సిద్ధమేనని, ఒకవేళ ఎవరూ రాకపోయినా ఒంటరిగానే సంతోషంగా ఉండగలనని రామ్ చెప్పారు. సినిమా రంగంలో ఎప్పుడూ చాలా మందితో కలిసి పనిచేయాల్సి వచ్చినప్పటికీ, తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించుకున్నానని వెల్లడించారు. ప్రత్యేకంగా లాక్‌డౌన్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు ఒంటరిగా గడిపిన విషయాన్ని గుర్తుచేసుకున్న రామ్, ఆ అనుభవం తన వ్యక్తిత్వాన్ని మరింత బలపరిచిందని చెప్పారు. మొత్తానికి పెళ్లిపై వస్తున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో ఆయన క్లారిటీ ఇచ్చినట్లైంది.





# డగౌట్‌లో ఫోన్.. మేనేజర్‌కు నోటీసులు



గౌహతి,మన గళం : రాజస్థాన్ రాయల్స్ జట్టు మేనేజర్ రోమి బిందర్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి కఠిన చర్యలకు దిగింది. మ్యాచ్ సమయంలో డగౌట్‌లో సెల్‌ఫోన్ ఉపయోగించిన ఘటనపై ఆయనకు నోటీసులు జారీ చేసింది. గత శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్లేయర్స్ డగౌట్ ఏరియాలో రోమి బిందర్ సెల్‌ఫోన్ ఉపయోగిస్తున్న దృశ్యాలు బయటకు రావడంతో వివాదం చెలరేగింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నియమావళి ఉల్లంఘనపై తీవ్ర చర్చ మొదలైంది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న బీసీసీఐ, తన యాంటీ కరప్షన్ మరియు సెక్యూరిటీ విభాగమైన ఏసీఎస్‌యూ ద్వారా దర్యాప్తు ప్రారంభించింది. రోమి బిందర్‌కు 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. డగౌట్‌లో ఫోన్ ఎందుకు ఉపయోగించారన్న అంశంపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ ఘటనపై మాజీ ఐపీఎల్ చైర్మన్ లలిత్ మోదీ కూడా స్పందిస్తూ, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ, పూర్తి నివేదిక అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే రోమి బిందర్ ఆరోగ్య కారణాల దృష్ట్యా ఫోన్‌ను వెంట తీసుకెళ్లి ఉండవచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆయనకు ఆరోగ్య సమస్యలు ఉన్న నేపథ్యంలో కొంత సడలింపు ఉండొచ్చని భావిస్తున్నారు. కానీ నియమాల ప్రకారం డగౌట్‌లో ఫోన్ వినియోగం నిషేధం కావడంతో ఈ ఘటనపై తుది నిర్ణయం దర్యాప్తు నివేదికపై ఆధారపడి ఉండనుంది.

---

# ఆసియా రెజ్లింగ్‌లో భారత్ సత్తా.. పతకాల పంటతో రన్నరప్ స్థానం



బిష్కెక్, మన గళం: కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్ వేదికగా జరిగిన ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్లో భారత రెజ్లర్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. టోర్నీ చివరి రోజున కూడా భారత్ ఖాతాలో రెండు రజతాలు, ఒక కాంస్య పతకం చేరడంతో జట్టు ప్రదర్శనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ బలమైన పోటీ ఇస్తూ రన్నరప్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. చివరి రోజు పోటీల్లో అమన్ సెహ్రావత్ (61 కేజీలు) తన విభాగంలో ఫైనల్ వరకు అద్భుతంగా పోరాడి రజత పతకాన్ని సాధించాడు. అలాగే ముకుల్ దహియా (86 కేజీలు) కూడా గట్టి పోటీ ఇస్తూ రజతాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఇక హెవీవెయిట్ విభాగంలో దినేశ్ (125 కేజీలు) కాంస్య పతకాన్ని గెలుచుకుని భారత్‌కు మరో మెడల్ అందించాడు. ఈ ముగ్గురు రెజ్లర్లు తమ ప్రదర్శనతో జట్టుకు కీలక పాయింట్లు అందించారు. ఈ టోర్నీలో మొత్తం ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, ఒక కాంస్య పతకం సాధించి 162 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. కాగా ఇరాన్ 178 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇరాన్‌తో చివరి వరకు పోటీ పడిన భారత్, స్వల్ప తేడాతోనే మొదటి స్థానాన్ని కోల్పోయింది. ఈ పోటీల్లో భారత రెజ్లర్ల స్థిరమైన ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ప్రారంభం నుంచి చివరి వరకు ప్రతి విభాగంలోనూ పోటీ ఇచ్చిన భారత జట్టు, అంతర్జాతీయ స్థాయిలో తన శక్తిని మరోసారి నిరూపించింది. ముఖ్యంగా యువ రెజ్లర్లు చూపిన ధైర్యం, నైపుణ్యం భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలకు దారితీసేలా కనిపిస్తోంది.

రెజ్లింగ్ రంగంలో భారత్ స్థిరంగా ఎదుగుతున్న సంకేతాలు ఈ టోర్నీ ద్వారా స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ వేదికలపై భారత రెజ్లర్లు వరుస విజయాలు సాధిస్తుండటం, దేశానికి క్రీడా గౌరవాన్ని తీసుకువస్తోంది. ఈ విజయం కూడా అదే దిశలో మరో ముందడుగుగా నిలిచింది. మొత్తం మీద బిష్కెక్ వేదికగా జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ప్రదర్శన క్రీడాభిమానులను ఉత్సాహపరిచింది. రాబోయే అంతర్జాతీయ టోర్నీల్లో కూడా ఇదే జోరు కొనసాగిస్తారని ఆశిస్తున్నారు.



# ముంబైపై కోహ్లీకి వెయ్యి పరుగుల మైలురాయి

ముంబై, మన గళం :విరాట్ కోహ్లీ ఐపీఎల్ చరిత్రలో మరో అరుదైన రికార్డు సృష్టించాడు. వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్తో జరిగిన మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన కోహ్లీ, అదే సమయంలో ఈ జట్టుపై 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో 38 బంతుల్లో 50 పరుగులు చేసిన కోహ్లీ, తన సొంత రికార్డుల జాబితాను మరింత విస్తరించాడు. ఈ మైలురాయిని చేరుకోవడానికి అతను 36 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. దీంతో ముంబైపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.ఇప్పటివరకు ఈ రికార్డు కేఎల్ రాహుల్ పేరిట ఉండగా, అతను 21 ఇన్నింగ్స్‌ల్లో 977 పరుగులతో రెండో స్థానానికి చేరాడు. అలాగే శిఖర్ ధావన్, అజింక్యా రహానే, సురేష్ రైనా తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో కోహ్లీ ఫామ్ కొనసాగుతుండటంతో, మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతని స్థిరమైన ప్రదర్శన జట్టుకు బలంగా మారడమే కాకుండా, అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది.

# సూర్యవంశీని ఆపడం సవాల్






హైదరాబాద్, మన గళం : ఐపీఎల్ 2026లో అద్భుత ఫామ్ లో దూసుకుపోతున్న రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కొనేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. నేడు హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ కీలక మ్యాచ్‌లో విజయం సాధించాలంటే ప్రత్యర్థి జట్టులో అత్యంత ప్రమాదకర బ్యాటర్‌గా మారిన వైభవ్ సూర్యవంశీని కట్టడి చేయడం అత్యంత కీలకంగా మారింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించి అగ్రస్థానంలో ఉన్న రాజస్థాన్ జట్టు, ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. రియాన్ పరాగ్ నాయకత్వంలో జట్టు సమష్టిగా రాణిస్తుండగా, సూర్యవంశీ పేలవంగా కాకుండా ధాటిగా ఆడుతూ మ్యాచ్‌ల గమనాన్ని మార్చేస్తున్నాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ పరిస్థితి మాత్రం అంత సంతృప్తికరంగా లేదు. ముఖ్యంగా బౌలింగ్ విభాగం నిరాశపరుస్తోంది. గత మ్యాచ్‌లలో లక్ష్యాలను కాపాడుకోవడంలో విఫలమవడం జట్టుకు పెద్ద సమస్యగా మారింది. కోల్‌కతా మ్యాచ్ మినహా మిగిలిన ఆటల్లో బౌలర్లు స్థిరత్వం చూపలేకపోయారు. ఈ నేపథ్యంలో నేడు జరగబోయే మ్యాచ్‌లో సూర్యవంశీని తొందరగా ఔట్ చేయకపోతే భారీ స్కోరు ఇవ్వాల్సి వచ్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మ్యాచ్ హై స్కోరింగ్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. సన్‌రైజర్స్ బౌలర్లు కచ్చితమైన ప్రణాళికతో బౌలింగ్ చేయకపోతే రాజస్థాన్ బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించే అవకాశముంది. మరోవైపు సన్‌రైజర్స్ బ్యాటింగ్ విభాగం కూడా బాధ్యతగా ఆడాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ ప్రదర్శనే ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారనుంది.

# కిర్‌స్టెన్ ప్రభావమే టీమిండియా ఎదుగుదల: యువరాజ్





న్యూఢిల్లీ, మన గళం: భారత క్రికెట్ జట్టులో స్వర్ణయుగాన్ని తీసుకువచ్చిన కోచ్‌గా గ్యారీ కిర్‌స్టెన్‌ను మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ప్రశంసలతో ముంచెత్తాడు. 2008 నుంచి 2011 వరకు కిర్‌స్టెన్ కోచింగ్‌లో టీమిండియా సాధించిన విజయాలు యాదృచ్ఛికం కాదని, ఆయన నాయకత్వం జట్టు ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చిందని యువీ వెల్లడించాడు. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జట్టుగా ఆడే సంస్కృతిని తీసుకురావడంలో కిర్‌స్టెన్ కీలక పాత్ర పోషించాడని చెప్పాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్‌తో జరిగిన చర్చలో యువరాజ్ మాట్లాడుతూ.. కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే కిర్‌స్టెన్ జట్టుకు పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించాడని గుర్తుచేశాడు. నాలుగేళ్లలో మూడు ఫార్మాట్లలోనూ అగ్రస్థానాన్ని సాధిస్తామని చెప్పినప్పుడు ఆటగాళ్లు ఆశ్చర్యపోయినా, చివరకు అదే నిజమైందని వివరించాడు. ఆస్ట్రేలియా ఆధిపత్యం ఉన్న సమయంలోనే టీమిండియా ప్రపంచ క్రికెట్‌లో నంబర్ వన్‌గా ఎదగడం కిర్‌స్టెన్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నాడు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్న యువరాజ్.. "నువ్వు మ్యాచ్ విన్నర్‌వి" అంటూ కిర్‌స్టెన్ తనపై ఉంచిన నమ్మకం తన ఆటతీరును పూర్తిగా మార్చిందని చెప్పాడు. విఫలమైనా పట్టించుకోకుండా స్వేచ్ఛగా ఆడమని ప్రోత్సహించేవాడని, అదే తనలో ధైర్యాన్ని పెంచిందని తెలిపాడు. కోచ్ ఇచ్చే మానసిక బలం ఆటగాళ్ల ప్రదర్శనపై ఎంత ప్రభావం చూపుతుందో కిర్‌స్టెన్ ఉదాహరణగా నిలిచాడని అన్నారు. కిర్‌స్టెన్ మార్గదర్శకత్వంలోనే భారత జట్టు 2011లో ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించింది. అన్ని ఫార్మాట్లలోనూ అగ్రస్థానాన్ని అందుకుని భారత క్రికెట్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లిన కోచ్‌గా ఆయన నిలిచిపోయాడని యువరాజ్ స్పష్టం చేశాడు.

# మహిళల టీ20 వరల్డ్‌కప్‌కు భారీ ప్రైజ్‌మనీ



దుబాయ్, మన గళం: ఈ ఏడాది జూన్‌లో జరగనున్న మహిళల టీ20 వరల్డ్‌కప్ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి రికార్డు స్థాయిలో ప్రైజ్‌మనీని ప్రకటించింది. ఇంగ్లండ్, వేల్స్ వేదికలుగా దాదాపు రెండు నెలల పాటు జరిగే ఈ మెగా టోర్నీకి సుమారు రూ. 82 కోట్ల ప్రైజ్‌మనీని నిర్ణయించడం విశేషం. గత ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి మొత్తం బహుమతి మొత్తాన్ని సుమారు పది శాతం మేర పెంచినట్లు వెల్లడించారు. ఈసారి టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. గత ఎడిషన్‌లో కేవలం 10 జట్లు మాత్రమే ఉండగా, ఇప్పుడు పోటీ మరింత విస్తరించింది. జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఏడు వేదికలపై మ్యాచ్‌లు జరగనుండగా, ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానం ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. టోర్నీ ఆరంభ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లో శ్రీలంకఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతుంది. ప్రైజ్‌మనీ విషయానికి వస్తే, ఈసారి విజేత జట్టుకు రూ. 21.8 కోట్లు అందించనుండగా, రన్నరప్‌కు రూ. 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్స్‌కు చేరిన జట్లకు రూ. 6.29 కోట్లు చొప్పున లభిస్తాయి. గ్రూప్ దశలో పాల్గొన్న ప్రతి జట్టుకు రూ. 29 లక్షలు కేటాయించారు. మొత్తంగా ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తెలిపింది. ఈ టోర్నీలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్, శ్రీలంక, ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్కాట్లాండ్ జట్లు పోటీపడనున్నాయి.


Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.